# అయాచిత సత్కారం

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

రావుకీ నాకు నేస్తం యీనాటిది కాదు. వయస్సుగానీ కాలంగానీ మమ్మల్ని వేరుచేయలేకపోయింది. యిద్దరికీ అక్షరాభ్యాసం ఒకే రోజే జరిగింది. ఒకేరోజే యిద్దరం హైస్కూల్లో అడుగుబెట్టాం. కానీ వాడు అంచెలూ మెట్లూ దాటేస్తూ బి. ఏ. బి యల్ కి సాగిపోయాడు. నేనో మెట్రిక్యులేషను మువ్మారు గుంజిమూసి యక లాభంలేక "కులవృత్తికి సాటిలేదు గువ్వల చెన్నా" అంటూ పొలం గట్లూ చూసుకుంటూ ఊళ్ళోనే ఉన్నాను. కానీ ఏ అంతస్తులూ ఏ ప్రత్యేకపరిస్థితులూ మమ్మల్ని వేరుచేయలేవు. యీ విషయం ఊళ్ళో అందరికీ తెలుసు.

ఒకరోజు ఉదయం ప్రియురాలు అతి యిరవై కోరికలతో నసుగుతూ యిచ్చిన కాఫీ పానీయాన్ని సేవించి కుర్చీలో కూలబడి పదిదినాలక్రిందటి న్యూస్ పేపరు చదువుతూన్నాను. యింతలోనే ఆకాశం నుంచీ ఊడిపడ్డట్టుగా ఒక మహానీయుడు వచ్చి ఎదుటబడ్డాడు. ఆ జరీకండువా, సిల్కులాల్చీ, మెరిసే బూట్లూ మహా యిదిగా ఉన్నాడులే. నూటయాభై పౌన్ల శరీరం, మాట్లాడడానికే ఆయాసం, ఎన్నడూ ఎండ కన్నెరుగనివాడుగా ఉన్నాడు. అతడెవ్వడో తెలియనందున ప్రశ్నార్థకంగా చూచిన నన్ను చూస్తే అతనికి నవ్వొచ్చింది. నన్నే ఎరగవుట్రా శేఖరాన్ని. అప్పుడే మరచిపోయావా మన ఫోర్తుఫారమూ నాయుడుగారమ్మాయీ, అంటూ చెయ్యి జారుగా భుజంపై వేయగానే నా భుజస్కంధం ఊడిపోయినట్లయింది.

క్షణంలో చిన్ననాటి విషయాలన్నీ స్మృతిపటంపై తెరలు తెరలుగా అలుముకొన్నై. వాడూ నేనూ ఒకే క్లాసులో చదువుకొన్నాం. ఒకే పక్కపై నిద్రించాం. చిన్నప్పుడు చాలా అల్లరిగా ఉండేవాడు. బక్క చిక్కి ఉండేవాడు. మాస్టర్ల బొమ్మలను బోర్డుపై వేయడం, పిల్లకాయల వీపులను విమానంమోత మోగించడం అమ్మాయిల జడలుబట్టుకొని లాగడం ఒకటేమిటి ఆనాటి మా పట్టణ చరిత్రలో వాడికి సంబంధంలేని తుంటరిపనే లేదు. మేమంతా వాణ్ణి "ఎండు చేప" అని పిలిచేవాళ్ళం. ఫోర్తుఫారంనుంచే మా యిద్దరికీ ఎడబాటు సంభవించింది. తరువాత వాడు జూదాలకూ విలాసాలకూ చాలాడబ్బు ఖర్చుపెట్టినట్లూ గిండీ హార్సురేసెస్ లో ముప్పైవేలు ఒకేరోజున పోగొట్టుకొన్నట్లూ చివరకు జ్ఞానోదయమై మిగిలిన రెండువందల ఎకరాలతో శాంతంగా కాలం గడుపుతున్నట్లూ విన్నాను. కానీ చూడడమిదే మొదటిసారి.

ఇంతలోనే లోపలనుంచీ కాఫీ టిఫిన్ తయారైందని పిలుపువచ్చింది. వాడప్పుడే తినివచ్చానన్నాడు. ససేమిరా రానన్నాడు. "పోనీలే మాలాంటి పేదలయింట్లో మీరు తింటారా" అని నేను ఎత్తిపొడవగానే అమాంతం కుర్చీనుంచీ వంటింట్లోకి ఒకే గంతువేశాడు. సుష్టుగా తిని మరలా యథాస్థానాల నలంకరించాం. గత జీవితాన్నంతా నెమరువేసుకొన్నాం ... చింతతోపులో ప్రణయమూ, నాయుడుగారమ్మాయితో మంతనాలూ, బెడిసికొట్టడం దేహశుద్ధీ ఊర్లో ప్రఖ్యాతీ అన్నీ సింహావలోకనం చేసికొని నవ్వుకొన్నాం. వాడి ప్రస్తుత పరిస్థితినంతా ఏకరువు పెట్టాడు. తన యిద్దరు పిల్లలను గురించీ తన ఆదాయాన్ని గురించీ వివరిస్తూ హఠాత్తుగా సీరియస్ గా ముఖంపెట్టి నే 'నిప్పు డెందుకొచ్చానో తెలుసా' అన్నాడు. 'నా కెట్లా తెలుస్తుంది. 'జ్యోతిషం గూడా రాదే' అని నవ్వాను. కానీ వాడు నా నవ్వులో శృతికలపలేదు.

నే నెందుకొచ్చానో నీకు చెప్తే చాలా అసహ్యించుకొంటూ నసుకొంటానన్నాడు. అసలు విషయమేదో విడవరాదూ ఎందుకీ పీఠిక అన్నాను. ఇక వాడు ప్రారంభించాడు. వాడి మూడవ తమ్ముడు కృష్ణుడు ఏదో అల్లరి చిల్లరిగా రౌడీ వెధవలందరినీ వెంటేసుకొని తిరుగుతూంటాడట. గ్రామంలో వాడిఅనుచరుల తాండవం చాలా ఘోరంగా ఉండేదట. ఎన్నోమార్లు చెప్పిచూచినా లాభంలేకపోయిందట. ఆవూళ్ళో శూద్రవాళ్ళకూ మాదిగవాళ్ళకూ చాలాకాలంనుంచీ వైరముట. ఒక రోజున మాదిగవాళ్ళు పెళ్ళి సన్నాయి మేళంతో ఊరంతా అట్టహాసంగా ఊరేగింపు జరుపుతూన్నారట. ఊరేగింపు గ్రామమధ్యంలోనికి రాగానే శూద్రవాళ్ళంతా మెరవణిపై బడ్డారట. ఫలితం, ఒక మాదిగవాడు చంపబడ్డాడట. ఈ మాట చెబుతూంటే అతని కళ్ళలో నీళ్ళు సుడులుతిరిగినై. గద్గదస్వరంతో చెప్పడం ప్రారంభించాడు.

కృష్ణుడిని జైల్లో పెట్టారు. ఆ రోజు వాడు ఊళ్ళోనే లేడు. కానీ ప్రాసిక్యూషన్‌వాళ్ళు అతడే కారణమని ఆరోపించారు. ఇంకా తేలతిరగలేదు. అప్పుడే వాడు చిక్కి శల్యమయ్యాడు. బొత్తుగా అన్నం మానివేశాడు. వాడిపై 304 వ సెక్షన్ పెట్టారు. ఈ కేసు సెషన్సుకమిట్ అయితే తిరగడం అసంభవం. ఆ మేజస్ట్రీటుకు 'నువ్వొక్కడివే స్నేహితుడివి' అని వాడు నిలిపివేశాడు. జీవితమంతా క్రియాశూన్యమైన మాటల్లోనే గడిపిన వారు సమయోచితంగా మాట్లాడడం చేతగాదు. "అయితే నే నిలాంటి విషయాల్లో జోక్యం చేసుకునేవాణ్ణికాదే" అన్నాను. వాడి మనస్సు దెబ్బతిన్నది. బాబూ నువ్వలాంటివాడివి కాదు; ఆదర్శమైనవాడివి. నాకూ తెలుసు. కానీ వాడి జీవితాన్ని గమనించు. నా బాధను అర్థం చేస్కో. నా బ్రతుకులో నిన్నైనా ఎవరినైనా కోరే తుదికోరిక యిదొక్కటే అని

(38–వ పేజీ చూడుడు)



MANUFACTURERS
THE INDIA CANNING INDUSTRIES LTD.
VIJAYAVADA-2
For Madras City
Sovereign Sales Agency Ltd.,
1-12 Second Line Beach, Madras 1

# దేవదేవుని దురవస్థ

(21-వ పేజీ తరువాయి)

అంతట ఐసయిపోయి, "నేనేనండి కలిపింది" అన్నాను ఎరక్క.

శ్రీవారు రుద్రులై పోయి, "ఓరీ! నీచా! కాలేజీగుడ్డలకంపుతో కాఫీ జేసి పోస్తివి గదరా! సన్యాసీ! చూడు, నీ పాపిష్టి చేతి నేమి చేసెదనో" అంటూ వొక గడ్డిపోచను కైకొని నా కుడిచేతిమీద వేశారు. "*My God! ఏం Tragedy!*"

కొంచెము తెప్పరిల్లుకొని చూచేసరికి, నేను మంచంక్రింద ఉన్నాను. శ్రీవారు కనపడలేదు. చేయి చూసుకునేసరికి బొబ్బ యెక్కి వుంది!

నేను మరొకసారి ఉవ్వెత్తుగా ఉప్పొంగిన ఆశ్చర్యాంబుధిలో స్నానము జేస్తూండగానే, గదిలోంచి మా బావ అంటూన్న మాటలు వినిపించాయ్.

"ఇదిగో! మీ తమ్ముడు ఏదో ప్రైజులు కొట్టేడని సంతోషిస్తుంటివే, చూడు. చేతిమీద సిగరెట్ అంటించినా తెలివిరాని మొద్దుని." ★

# అయాచిత సత్కారం

(11-వ పేజీ తరువాయి)

వాడనేసరికి ఎందుకన్నానా ఆమాట అని పశ్చాత్తాపబడ్డాను. సరే ప్రయత్నిస్తాలే అన్నాను. వాడూ కొండంతభారం వదలినట్లుగా తృప్తిగా వెళ్ళిపోయాడు.

రోజులు గడచినవి. నేనూ యీ విషయాన్ని సంపూర్ణంగా మరచి పొయ్యాను. రోజూ డిప్టీమాజస్ట్రేటు యింటికి పోతూనే ఉన్నాను. రావూ మాయింటికి వస్తూనే ఉన్నాడు. యిద్దరం కొరుషి కొల్లూ కబుర్లోమాన్నా నడుపుతూనే ఉన్నాం. కానీ ఎన్నడూ నే నావిషయం ప్రస్తావించనే లేదు. అతడూ యిలాంటి విషయాలు నాతో ఎన్నడూ మాట్లాడలేదు.

ఒకరోజున అదే కుర్చీలో కూర్చొని పదేండ్లనాటి పాతపేపరు చదువుతున్నాను. పెళ్లాం పుట్టింటికి వెళ్ళింది. మనస్సు చికాకుగా ఉంది. యింతలోనే పోస్టుబ్బాయ్ వచ్చి తలుపుతట్టాడు. నాకేమైనా పేపరు వచ్చిందా అన్నాను. మీకు ఐదొందలు మనియార్డరూ ఒక రిజిస్టర్డ్ కవరూ వచ్చిందండీ అన్నాడు. నాన్నాలు జీవితంలో ఎన్నడూ యాభైకి మించి మనియార్డర్ రాలేదు. ఏ హిందీపత్రికా సంపాదకుడూ నాకు పదికి మించి పంపలేదు అని విడ్డూరపడుతూ డబ్బు తీసికొని పోస్టువాడి మామూలు వాడికిచ్చి కవరు చించి చదివాను.

డియర్ బ్రదర్, కృష్ణుడిని వదిలిపెట్టారు. అనుకున్నంతా నెరవేర్చావన్నమాట. ప్రాసిక్యూషన్ సాక్ష్యం బలంగా ఉంది. ఐనా కేసుకొట్టివేయబడింది. కారణ మెవ్వరికీ తెలియదు నాకు మినహా. ఈ నా కృతజ్ఞతాపూర్ణమైన బహుమానా న్నంగీకరించగలవని ప్రార్థన. —శేఖరం ★

# బైజు బావర

(31-వ పేజీ తరువాయి)

నిసరిగా తన ఓటమిని స్వయంగా ఒప్పుకొన్నాడు.

ఇక యెవరు మాత్రం ఏం చేయగలరు? అక్బరుబాదుషా కంట తడి పెట్టుకొని బైజూను పిలిచి, తాన్ సేన్‌కు యెటువంటి శిక్ష విధిస్తావో విధించుకోమని అతని ప్రాణాల్ను బైజూకు వప్పగించేశాడు. తాన్‌సేన్‌తో పాటుగా, చక్రవర్తి, ప్రజలూ కూడా బైజూ ఉరిశిక్షే విధించగలడని నమ్మారు. కాని బైజూ సవినయంగా, "ప్రభూ నాసరస్వతి పరులకు హానిచేసే నిర్భాగ్యురాలు గాని నిర్దయురాలు గానీ కాదు. నాగురువుకు యిచ్చిన వాగ్దానాన్ని బట్టి, ఎందరి ప్రాణాలనో బలిగొన్న యీ విద్వాంసునికి సయితం, నేను కీడు చేయలేను. కాని చిన్నమనవి నా దొకటి. మీరు మన్నించాలి. నేటినుండి ఆగ్రా నగరంలో వున్న యీ కరినశాసనాన్ని రద్దుచేయాలి. అదే నాకు పదివేలు"

అంతటితో చక్రవర్తి కళ్లకు క్రమ్మిన మాయపొర తొలగిపోయింది కృతజ్ఞతతో పరిపరివిధాల బైజూను పొగిడి, యెంతో గౌరవంచి, సత్కరించాడు. ప్రజలుసైతం బైజూను దేవతామూర్తిగా గౌరవించారు. తాన్ సేన్ తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చి వెక్కి వెక్కి యేడ్చాడు. దానితో అతని హృదయభారం తగ్గిపోయింది.

బైజూ ఆ తర్వాతకూడా తన గానకళా నైపుణ్యాన్ని పరోపకారానికే ఉపయోగించి తన కీర్తిని శాశ్వతంగా నిలబెట్టుకున్నాడు. ★



"ఎదురు చూపు"